నేటి మ్యాచులు | శ్రీలంక X నేపాల్ ఫ్లోరిడా – ఉ. 5.00 | ఆస్ట్రేలియా X నమీబియా అంటిగ్వా – రా. 6.00 | భారత్ X యూఎస్ఏ న్యూయార్క్ – రా. 8.00 | www.ntnews.com

పారిస్‌కు భారత 'షూటింగ్' సైన్యమిదే

- తెలంగాణ షూటర్ ఇషాసింగ్‌కు చోటు

ఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో ఈసారి దేశానికి కచ్చితంగా పతకాలు సాధిస్తారని భావిస్తున్న క్రీడలలో ఒకటిగా ఉన్న 'షూటింగ్'లో బరిలోకి దిగబోయే ఆటగాళ్ల పేర్లను జాతీయ రైఫిల్ సమాఖ్య (ఎన్ఆర్ఏఐ) మంగళవారం వెల్లడించింది. తెలంగాణ అమ్మాయి, గత ఆసియాగేమ్స్(2022)లో నాలుగు పతకాలు సాధించిన యువ షూటర్ ఇషాసింగ్‌తో పాటు మరో 14 మంది షూటర్లు పారిస్‌కు వెళ్లే జట్టులో చోటు దక్కించుకున్నారు. అంతర్జాతీయ స్థాయి టోర్నీల్లో అద్భుత ప్రదర్శన కనబరుస్తున్న ఇషాసింగ్..విశ్వక్రీడల్లోనూ సత్తాచాటాలన్న పట్టుదలతో ఉంది. తన చెక్కుచెదరని గురితో ఇప్పటికే లెక్కకు మిక్కిలి పతకాలు సాధించిన ఈ హైదరాబాదీ పారిస్ తన కలను సాకారం చేసుకోవాలని చూస్తున్నది. వచ్చే నెలలో జరుగనున్న విశ్వక్రీడల్లో 25మీటర్ల పిస్టల్ విభాగంలో ఇషా బరిలోకి దిగనుంది. మరోవైపు మనూ బాకర్ రెండు విభాగాల్లో (మహిళల 10 మీటర్లు, 25 మీటర్లు) పోటీపడుతున్నది. మునుపెన్నడూ లేని విధంగా భారత్ ఈసారి ఒలింపిక్స్‌లో ఏకంగా 21 కోటాలు (8– రైఫిల్, 8–పిస్టల్.. 5–షాట్‌గన్) దక్కించుకోవడం విశేషం. రైఫిల్, పిస్టల్ ఈవెంట్స్‌లో తలపడబోయే షూటర్ల జాబితాను ప్రకటించగా షాట్‌గన్ విభాగంలో బుధవారం నుంచి లొనాటో (ఇటలీ) వేదికగా జరుగబోయే వరల్డ్‌కప్ తర్వాత భారత జట్టును ప్రకటించనున్నారు.

పారిస్ బెర్తు దక్కించుకున్న షూటర్లు

పిస్టల్: ఇషా సింగ్, సరబ్‌జీత్ సింగ్, అర్జున్, మనూ భాకర్, రిధమ్ సంగ్వాన్, అనీష్ బన్వల్,

రైఫిల్: సందీప్ సింగ్, అర్జున్ బబుతా, ఎలవెనిల్ వలరివన్, రమిత, సిఫ్ట్ కౌర్ సమ్రా, అంజుమ్ మోద్గిల్, ఐశ్వర్య తోమర్, స్వప్నిల్,

సాత్విక్ జోడీ నంబర్‌వన్ చేజారె

ఢిల్లీ: బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ (బీడబ్ల్యూఎఫ్) కొద్ది రోజుల క్రితం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ ర్యాంకు చేజిక్కించుకున్న భారత స్టార్ ద్వయం సాత్విక్‌సాయిరాజ్–చిరాగ్‌శెట్టి అగ్రస్థానాన్ని కోల్పోయారు. తాజా ర్యాంకులలో భారత జోడీ.. రెండు స్థానాలు కోల్పోయి (93,720 పాయింట్లు) మూడో స్థానానికి పడిపోయింది. గత నెలలో థాయ్‌లాండ్ ఓపెన్ గెలిచి మొదటి స్థానానికి చేరిన సాత్విక్ ద్వయం.. సింగపూర్ ఓపెన్‌లో విఫలమవగా ఇండోనేషియా, ఆస్ట్రేలియా ఓపెన్ నుంచి తప్పుకున్నారు. 1,01,718 పాయింట్లతో చైనా జంట లియాంగ్ వీ కెంగ్ – వాంగ్ చెంగ్ మొదటి ర్యాంక్‌కు దూసుకెళ్లగా డెన్మార్క్ ఆటగాళ్లు కిమ్ అస్ట్రప్ – అండర్స్ స్కారుప్ (95,153) నాలుగో ర్యాంక్ నుంచి రెండో ర్యాంక్‌కు ఎగబాకారు. పురుషుల సింగిల్స్ విభాగంలో భారత స్టార్ ప్లేయర్ హెచ్ఎస్ ప్రణయ్ (10), లక్ష్యసేన్ (14) టాప్–15లో కొనసాగుతున్నారు. మహిళల సింగిల్స్ ర్యాంకులలో పీవీ సింధు 12వ ర్యాంక్‌లో ఉంది.

మెయిన్ డ్రాకు అభిషేక్

ఆస్ట్రేలియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ

సిడ్నీ: భారత యువ షట్లర్ అభిషేక్ యెలిగర్ ఆస్ట్రేలియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ మెయిన్ డ్రాకు అర్హత సాధించాడు. క్వాలిఫయర్స్ రౌండ్‌లో అభిషేక్ 21–14, 21–5తో భారత్‌కే చెందిన శశావత్ దలాల్‌ను, 21–15, 21–14తోజీ యింగ్ చాన్ (ఆస్ట్రేలియా)ను ఓడించాడు. తొలి రౌండ్‌లో అతడు ఇజ్రాయెల్ షట్లర్ మిషా జిల్బర్మన్‌తో తలపడనున్నాడు. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో హర్షిత–శృతి జంట.. 19–21, 19–21తో డెనియ నుగ్రొహో–కై కి బెర్నిన్ (ఆస్ట్రేలియా) చేతిలో చిత్తైంది. పురుషుల సింగిల్స్‌లో హెచ్ ఎస్ ప్రణయ్, కిరణ్ జార్జి, డబుల్స్‌లో అభిమన్యు–అమన్ సైతం బుధవారం బరిలోకి దిగనున్నారు.

ఎమ్ఎమ్ఏలో సంగ్రామ్‌సింగ్

ముంబై: మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్(ఎమ్ఎమ్ఏ)లో భారత ప్రాతినిధ్యం పెరుగుతూ వస్తున్నది. ఇప్పటికే పూజ తోమర్ అద్భుత విజయాలతో దూసుకెళుతుండగా, తాజాగా సంగ్రామ్ సింగ్ అరంగేట్రానికి రంగం సిద్ధమైంది. ఎమ్ఎమ్ఏలో ఆడబోతున్న తొలి భారత రెజ్లర్‌గా సంగ్రామ్ అరుదైన రికార్డును సొంతం చేసుకోబోతున్నాడు. కామన్వెల్త్ హెవీ వెయిట్ మాజీ చాంపియన్ అయిన సంగ్రామ్..ఎమ్ఎమ్ఏలో ఆడేందుకు ఆసక్తితో ఎదురుచూస్తున్నని పేర్కొన్నారు. భారత్‌లో ఎమ్ఎమ్ఏకు ఆదరణ అంతకంతకూ పెరుగుతున్నదని, రానున్న రోజుల్లో తనకు మరింత మద్దతు లభిస్తుందని సింగ్ చెప్పుకొచ్చాడు.

భారత్‌లో 2025 జూనియర్ హాకీ వరల్డ్ కప్

ఢిల్లీ: వచ్చే ఏడాది జరగాల్సి ఉన్న పురుషుల జూనియర్ హాకీ వరల్డ్ కప్‌నకు భారత్ ఆతిథ్యమివ్వనుంది. 2025 డిసెంబర్‌లో ఈ టోర్నీని భారత్‌లో నిర్వహించనున్నట్టు అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. 24 జట్లు తలపడబోయే ఈ టోర్నీ ఆతిథ్య హక్కులు అందజేసినందుకు భారత హాకీ అధ్యక్షుడు దిలీప్ టిర్కీ ఎఫ్ఐహెచ్‌కు కృతజ్ఞతలు తెలిపాడు. భారత్ చివరి సారిగా 2021 (భువనేశ్వర్)లో ఈ టోర్నీకి ఆతిథ్యమిచ్చింది.

భారత్ 'ఫిఫా' ఆశలు ఆవిరి

దోహా: ఫిఫా వరల్డ్ కప్ క్వాలిఫయర్స్‌లో ఆడేందుకు గాను ఆసియా రీజియన్ నుంచి మూడో రౌండ్‌కు అర్హత సాధించాలంటే తప్పక నెగ్గాల్సిన మ్యాచ్‌లో భారత్ 2–1 తేడాతో ఖతార్ చేతిలో ఓటమిపాలైంది. రిఫరీ వివాదాస్పద నిర్ణయంతో 'బ్లూ టైగర్స్' పరాభవాన్ని మూటగట్టుకుని వరల్డ్ కప్ అర్హత రౌండ్లు ఆడే అవకాశాన్ని కోల్పోయింది. భారత్ తరఫున చాంగ్టె 36వ నిమిషంలో ఏకైక గోల్ కొట్టాడు. ఖతార్ నుంచి 74వ నిమిషంలో యూసెఫ్ ఐమెన్, అహ్మద్ (86వ నిమిషంలో) గోల్స్ చేశారు.

జోరు సాగనీ

నేడు భారత్, అమెరికా పోరు • దూకుడు మీదున్న ఇరు జట్లు • సూపర్-8 లక్ష్యంగా బరిలోకి

టీ20 ప్రపంచకప్‌లో భారత్ వరుస విజయాల జోరు కొనసాగుతున్నది. తమ తొలి మ్యాచ్‌లో ఐర్లాండ్‌పై ఘనమైన బోణీ కొట్టిన టీమ్ఇండియా.. మలి మ్యాచ్‌లో దాయాది పాకిస్థాన్‌ను మట్టికరిపించింది. తమ సుదీర్ఘ కలను సాకారం చేసుకోవాలన్న పట్టుదలతో ఉన్న రోహిత్‌సేన..ఎదురైన ప్రత్యర్థినల్లా చిత్తుచేస్తూ ముందుకు సాగుతున్నది. బుధవారం ఆతిథ్య అమెరికాతో న్యూయార్క్‌లో తలపడనుంది.భారత్ తరహాలోనే అమెరికా మంచి దూకుడు మీదుంది. కెనడా, పాకిస్థాన్‌పై విజయాలతో ఆత్మవిశ్వాసంతో ఉన్న అమెరికా..అదే పంథాను భారత్‌పై కొనసాగించాలని చూస్తున్నది. న్యూయార్క్ వేదికగా ఇరు జట్లు అమీతుమీ తేల్చుకోనున్నాయి. హ్యాట్రిక్ విజయం ద్వారా సూపర్–8 బెర్తు దక్కించుకోవాలన్న పట్టుదలతో ఇరు జట్లు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో టైటిల్ ఫేవరేట్ టీమ్ఇండియాకు అమెరికా బీటైన పోటీనిస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

న్యూయార్క్: భారత్, అమెరికా మధ్య పోరుకు రంగం సిద్ధమైంది. బుధవారం నసావు స్టేడియం వేదికగా ఇరు జట్లు ముఖాముఖి తలపడనున్నాయి. టైటిల్ హాట్ ఫేవరేట్లలో ఒకటైన టీమ్ఇండియా..ఇప్పుడిప్పుడే అంతర్జాతీయ క్రికెట్‌లో ఓనమాలు నేర్చుకుంటున్న అమెరికాపై తమ ప్రతాపం చూపించాలన్న పట్టుదలతో ఉంది. పాకిస్థాన్‌పై ఉత్కంఠ విజయమిచ్చిన ఉత్సాహంతో ఉన్న రోహిత్‌సేన..యూఎస్ఏపై గెలిచి సూపర్–8 బెర్తు దక్కించుకునేందుకు పక్కా ప్రణాళికతో ఉన్నది. పేరుకు అమెరికా అయినా జట్టంతా ప్రవాస భారతీయులతో కనిపిస్తున్నది. జట్టులో అగ్రభాగం మనోళ్లదే కావడం విశేషం. అసలు అమెరికా జట్టేనా లేక ద్వితీయశ్రేణి భారత టీమ్ అన్న సందేహం కలుగక మానదు. ఇదిలా ఉంటే ఆడిన రెండు మ్యాచ్‌ల్లో రెండింటి గెలిచిన టీమ్ఇండియా టాప్ గేర్‌లో దూసుకెళుతుంటే..అమెరికా తామేం తక్కువ కాదన్నట్లు జోరు కనబరుస్తున్నది. పరీక్ష పెడుతున్న నసావు పిచ్‌పై ఒక అంచనాకు రాలేకపోతున్న రోహిత్‌సేన..అమెరికా జట్టును ఎలా డీల్ చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది. లోస్కోరింగ్ థ్రిల్లర్‌లు నమోదు అవుతున్న మెగాటోర్నీలో భారత్‌కు అమెరికా పోటీనిస్తుందో చూడాలి.

సూపర్–8 లక్ష్యంగా:

మెగాటోర్నీలో భారత్ సూపర్–8 లక్ష్యంగా అడుగులు వేస్తున్నది. గత 11 ఏండ్లుగా ఐసీసీ ట్రోఫీ కోసం చకోరా పక్షిలా ఎదురుచూస్తున్న టీమ్ఇండియా మరీ ఈసారైనా తమ కలను సాకారం చేసుకుంటుందా అన్నది అభిమానుల మెదళ్లను తొలుస్తున్నది. ఈ నేపథ్యంలో ప్రతీ మ్యాచ్ కీలకం కాబోతున్నది. రెండింట విజయాలతో మెరుగైన స్థితిలో ఉన్న టీమ్ఇండియా అదే గెలుపు జోరు కొనసాగిస్తూ అమెరికా పనిపట్టాలని చూస్తున్నది. అయితే పాకిస్థాన్‌పై మన వాళ్ల బ్యాటింగ్ ప్రదర్శన తర్వాత ఒకింత ఆందోళన కల్గిస్తున్నది. అనూహ్యంగా స్పందిస్తున్న పిచ్‌పై పరుగులు ఎలా రాబట్టాలో తెలియక టీమ్ఇండియా స్వల్ప స్కోరుకే కుప్పకూలింది. అమెరికాపై మళ్లీ అలాంటి పరిస్థితి ఎదురుకాకుండా ఉండేందుకు రోహిత్‌సేన జాగ్రత్త పడే అవకాశముంది. యూఎస్ఏతో మ్యాచ్ కోసం పెద్దగా మార్పులు లేకుండానే బరిలోకి దిగే చాన్స్ ఉంది. ముఖ్యంగా వరుసగా విఫలమవుతున్న శివమ్ దూబే స్థానంపై సందిగ్ధత కొనసాగుతున్నది.

సత్తాచాటాలని:

ద్వితీయ శ్రేణి భారత జట్టుగా కనిపిస్తున్న అమెరికా..మెగాటోర్నీలో సత్తాచాటాలని చూస్తున్నది. ఇప్పటికే పాకిస్థాన్‌కు దిమ్మతిరిగే రుులక్ ఇచ్చిన యూఎస్ఏ..భారత్‌కు పోటీనిచ్చేందుకు తహతహలాడుతున్నది. ఉద్యోగాలు, చదువుల కోసం వచ్చి స్థిరపడ్డ ప్రవాస భారతీయుల సమాహారంగా కనిపిస్తున్న అమెరికా..సొంతగడ్డపై పరిస్థితులను అనుకూలంగా మలుచుకోవాలని చూస్తున్నది. గత మ్యాచ్ హీరో నేత్రవాల్కర్‌కు సూర్యకుమార్‌యాదవ్‌తో ఆడిన అనుభవముంది. ఇలా భారత్‌తో ఆడే అవకాశాన్ని దక్కించుకున్న అమెరికా ఏ మేరకు పోటీనిస్తుందో చూడాలి.

జట్ల అంచనా: భారత్: రోహిత్(కెప్టెన్), కోహ్లీ, పంత్, సూర్యకుమార్, దూబే, పాండ్యా, జడేజా, అక్షర్, బుమ్రా, సిరాజ్, అర్ష్‌దీప్.

అమెరికా: మోనాంక్‌పటేల్(కెప్టెన్), స్టీవెన్ టేలర్, గౌస్, జోన్స్, నితీశ్, అండర్సన్, హర్మీత్‌సింగ్, జస్‌దీప్‌సింగ్, కెంజిగె, నేత్రవాల్కర్, అలీఖాన్.

అమీర్ 2/13

గెలిచి నిలిచిన పాక్

కెనడాపై గెలుపు

సూపర్-8 ఆశలు సజీవం

న్యూయార్క్: టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్ ఎట్టకేలకు బోణీ కొట్టింది. ఈ టోర్నీలో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో ఆ జట్టు సమిష్టిగా రాణించి కెనడాపై 7 వికెట్ల తేడాతో గెలిచింది. మంగళవారం న్యూయార్క్‌లోని నసావు స్టేడియం వేదికగా కెనడాతో జరిగిన మ్యాచ్‌లో కెనడాను ఓడించి సూపర్–8 ఆశలను సజీవంగా ఉంచుకుంది. మహ్మద్ అమిర్ (2/13), హారిస్ రవూఫ్ (2/26) ధాటికి తొలుత బ్యాటింగ్ చేసిన కెనడా.. 20 ఓవర్లలో 106/7 కే పరిమితమైంది. ఆరోన్ జాన్సన్ (44 బంతుల్లో 52, 4 ఫోర్లు, 4 సిక్సర్లు) మినహా అందరూ విఫలమయ్యారు. స్వల్ప ఛేదనలో పాక్.. 17.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. మహ్మద్ రిజ్వాన్ (53 బంతుల్లో 53 నాటౌట్, 2 ఫోర్లు, 1 సిక్స్) అర్ధసెంచరీతో రాణించాడు. అమిర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

ఆరోన్ ఒక్కడే..

పటిష్టమైన పాకిస్థాన్ పేస్ బలానికి పసికూన కెనడా విలవిల్లాడింది. ఆ జట్టులో ఓపెనర్ ఆరోన్ ఒక్కడే రాణించాడు. ఎదుర్కున్న తొలి రెండు బంతులనే బౌండరీలుగా మలిచిన అతడు సహచర ఆటగాళ్లు వచ్చినోళ్లు వచ్చినట్టే క్రీజును వదులుతున్నా ఒంటరిగా పోరాడాడు. ఆరోన్ మినహా కెప్టెన్ సద్ బిన్ జఫర్ (10), కలీమ్ సనా (13) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు.

పాక్ కష్టంగానే..

స్వల్ప ఛేదనలో పాకిస్థాన్ కూడా ధాటిగా ఆడలేకపోయింది. సారథి బాబర్ ఆజమ్ (33 బంతుల్లో 33) ఓపెనర్ స్థానాన్ని యువ ఆటగాడు సయీమ్ అయూబ్ (6) కు త్యాగం చేసినా అతడు విఫలమయ్యాడు. వన్ డౌన్‌లో వచ్చిన బాబర్‌తో కలిసి రిజ్వాన్ రెండో వికెట్‌కు 63 పరుగులు జోడించి పాక్ విజయాన్ని ఖాయం చేశాడు. బాబర్ నిష్క్రమించినా రిజ్వాన్ చివరిదాకా క్రీజులో నిలిచి లాంఛనాన్ని పూర్తిచేశాడు.

సంక్షిప్త స్కోర్లు:

కెనడా: 20 ఓవర్లలో 106/7 (ఆరోన్ 52, సనా 13, అమిర్ 2/13, రవూఫ్ 2/26). **పాకిస్థాన్:** 17.3 ఓవర్లలో 107/3 (రిజ్వాన్ 53 నాటౌట్, బాబర్ 33, డిల్లాన్ 2/18, గోర్డన్ 1/17)

గుడ్లలో నాణ్యత లేకుంటే చర్యలు

- మహబూబాబాద్ జిల్లా సంక్షేమ అధికారి వరలక్ష్మి హెచ్చరిక
- అంగన్‌వాడీ సెంటర్‌లో కుళ్లిన గుడ్లపై విచారణ
- 'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

నమస్తే ఎఫెక్ట్

బయ్యారం, జూన్ 11: అంగన్‌వాడీ కేంద్రాలకు అందించే గుడ్ల పంపిణీ విషయంలో నాణ్యత పాటించకుంటే సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకుంటామని జిల్లా సంక్షేమాధికారి వరలక్ష్మి హెచ్చరించారు. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కొత్తపేట అంగన్‌వాడీ–2 సెంటర్‌లో కుళ్లిన గుడ్లను పంపిణీ చేయడంతో ఓ చిన్నారి తల్లి అస్వస్థతకు గురికావడంపై 'అంగన్‌వాడీ సెంటర్లలో కుళ్లిన గుడ్లు' శీర్షికన 'నమస్తే తెలంగాణ' మంగళవారం కథనాన్ని ప్రచురించింది. స్పందించిన జిల్లా సంక్షేమ అధికారి సెంటర్‌ను సందర్శించి అంగన్‌వాడీ టీచర్ మల్లికాంబ నుంచి వివరాలు సేకరించారు. చిన్నారి తల్లికి ఎన్ని గుడ్లు ఇచ్చారు? ఎప్పుడు ఇచ్చారు? అనే విషయంపై రికార్డులను పరిశీలించారు. అనంతరం గుడ్లు పాడైపోయిన తీరును చిన్నారి తల్లి స్రవంతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. ఎండ తీవ్రత, గత నెలలో మిగిలిన గుడ్లను పంపిణీ చేయడంతో సమస్య తలెత్తిందని తెలిపారు. ఏసీడీపీవో విజయలక్ష్మి ఉన్నారు.

సైబర్ మోసం.. రూ.48వేలు మాయం

- సైబర్ క్రైంకు బాధితుడి ఫిర్యాదు

ఓదెల, జూన్ 11: పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం నాంపానిపల్లికి చెందిన రైతు వీరవేని సంపత్‌ను సైబరన్ నేరస్థులు మాయమాటలతో మోసగించి రూ.48 వేలు కాజేశారు. వివరాల్లోకెళ్తే.. సంపత్‌కు ఇటీవల పోస్టులో క్రెడిట్ కార్డు వచ్చింది. ఈ నెల 3న ఆయనకు ఓ ఫోన్‌కాల్ వచ్చింది. 'మేము బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నాం. ఓటీపీ చెబితే మీ క్రెడిట్ కార్డు యాక్టివేట్ అవుతుంది' అని నమ్మబలకడంతో నిజమే అనుకున్నాడు. వారికి ఓటీపీ నంబర్ చెప్పాడు. సోమవారం తన సెల్‌ఫోన్ చెక్ చేయగా.. రూ.48 వేలు కట్ అయినట్టు మెసేజ్ ఉండడాన్ని గమనించాడు. అనంతరం పొత్కపల్లి పోలీస్ స్టేషన్‌కెళ్లి తనకు జరిగిన మోసంపై సైబర్ క్రైమ్ యాప్‌లో ఫిర్యాదు చేశాడు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో బ్యాంక్ మేనేజర్

- భయంతో రూ.1.56 లక్షల సమర్పణ.. పోలీసులకు ఫిర్యాదు

నాగర్‌కర్నూల్ టౌన్, జూన్ 11: సైబర్ నేరగాళ్ల ఉచ్చులో ఓ బ్యాంకు మేనేజర్ చిక్కుకున్నాడు. నాగర్‌కర్నూల్‌లోని ఓ ప్రైవేట్ బ్యాంకులో పనిచేస్తున్న ఆయన ఫోన్‌కు వారం క్రితం మెసేజ్ రూపంలో ఓ లింక్ వచ్చింది. దాన్ని ఓపెన్ చేయడంతో ఆ ఫోన్‌ను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు.. ఆయన వాట్సాప్ డీపీని న్యూడ్ ఫొటోగా మార్చి, బ్లాక్‌మెయిల్ చేశారు. దీంతో భయపడిన ఆ మేనేజర్ రూ.1.56 లక్షలు ముట్టజెప్పాడు. బాధితుడి కాంటాక్ట్స్‌లో ఉన్న 300 మందికి న్యూడ్ ఫొటోలను పంపి, మరింత డబ్బు డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు హైదరాబాద్ సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించాడు.

కరెంట్ బిల్లు రూ.6,72,642

అవాక్కైన ఇంటి యజమాని

ఆత్మకూరు(ఎం), జూన్11: ఇంటి కరెంట్ బిల్లు చూసిన యజమానికి ఒక్కసారిగా గుండె ఆగిపోయినంత పని అయ్యింది. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం రహీంఖాన్‌పేటలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. గ్రామానికి చెందిన డీ పరశురాములు సర్వీస్ నంబర్ 4620700570 విద్యుత్తు బిల్లు రీడింగ్ తీసేందుకు సోమవారం ట్రాన్స్‌కో సిబ్బంది వచ్చారు. ప్రతి నెలా గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్లలోపు సబ్సిడీ వర్తించే సర్వీస్ నంబర్.. సోమవారం మీటర్ రీడింగ్‌ను స్కాన్ చేస్తుండగా ఒక్కసారిగా రూ.6,72,642 బిల్లు వచ్చింది. 200 యూనిట్ల లోపే వచ్చే రీడింగ్ ఒక్కసారిగా 5,40,927 యూనిట్లు వాడినట్టు రావడంతో ఇంటి యాజమాని అవాక్కయ్యాడు. గృహజ్యోతి కింద సబ్సిడీ వస్తున్న విద్యుత్తు బిల్లు ఏకంగా రూ.6,72,642 రావడం ఏంటని ట్రాన్స్‌కో సిబ్బందిని ప్రశ్నించాడు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ ప్రభాకర్‌రెడ్డిని వివరణ కోరగా.. రీడింగ్ తీస్తున్న సమయంలో హై ఓల్టేజ్ వచ్చినట్టయితే రీడింగ్ జంప్ అయ్యి పెద్ద మొత్తంలో బిల్లు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. అధిక బిల్లు వచ్చిన మీటర్‌ను టెస్టింగ్ కోసం పంపినట్టు ఏఈ వివరించారు.

ప్రధాన నిందితుడిగా ప్రభాకర్‌రావు

- ఫోన్ల ట్యాపింగ్ కేసులో 100 పేజీల చార్జిషీట్
- బెయిల్ పిటిషన్లపై నేడు తీర్పు

నాంపల్లి కోర్టులు, జూన్ 11 (నమస్తే తెలంగాణ): ఫోన్ల ట్యాపింగ్ కేసులో పంజాగుట్ట పోలీసులు మంగళవారం నాంపల్లి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. 100 పేజీలతో కూడిన ఈ చార్జిషీట్‌లో ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును ప్రధాన నిందితుడిగా.. ప్రణీత్‌రావు, భుజంగరావు, తిరుపతన్న, రాధాకిషన్‌రావుతోపాటు ఓ మీడియా సంస్థ ప్రతినిధి శ్రావణ్‌కుమార్‌ను ఇతర నిందితులుగా చేర్చారు. కాగా, ఈ కేసులో బెయిల్ కోసం ఏఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న దాఖలు చేసుకున్న పిటిషన్లపై తీర్పును న్యాయమూర్తి బుధవారం వాయిదా వేశారు.

- ఆర్టీసీ బస్సులు పెంచాలని పీవోడబ్ల్యూ ధర్నా

బస్సుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేస్తూ పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా బోధన్ ఆర్టీసీ బస్ డిపో ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఫ్రీ బస్ పథకం ప్రవేశపెట్టిన ప్రభుత్వం సర్వీసులను తగ్గించిందని, ప్రయాణికులకు సరిపడా బస్సులను పెంచాలని పీవోడబ్ల్యూ పట్టణాధ్యక్షురాలు నాగమణి డిమాండ్ చేశారు. ఫ్రీ బస్ పథకం రద్దు ప్రతిపాదనలుంటే రద్దు చేసుకోవాలని తెలిపారు. అనంతరం అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు.- శక్కర్‌నగర్

సమాచార కమిషనర్ దరఖాస్తులకు మరో అవకాశం

హైదరాబాద్, జూన్ 11 (నమస్తే తెలంగాణ) : సమాచార హక్కు చట్టం చీఫ్ కమిషనర్, కమిషనర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 29 వరకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వ సీఎస్ శాంతికుమారి మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. గత ఏడాది జూలై 4న విడుదల చేసిన నోటిఫికేషన్ మేరకు దరఖాస్తు చేసుకున్నవారు తిరిగి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. దరఖాస్తులను డాక్టర్ అంబేద్కర్ తెలంగాణ సెక్రటేరియట్, హైదరాబాద్–500022 పేరిట రిజిస్టర్ పోస్టు ద్వారా పంపించాలని తెలిపారు.

మున్సిపల్ చైర్మన్లను ప్రత్యక్షంగా ఎన్నుకోవాలి

మున్సిపల్ చాంబర్స్ అసోసియేషన్

హైదరాబాద్, జూన్ 11 (నమస్తే తెలంగాణ): పురపాలక సంఘాల చైర్మన్‌లకు ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ మున్సిపల్ చాంబర్స్ అసోసియేషన్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు కోరారు. హిమాయత్ నగర్‌లోని మున్సిపల్ చాంబర్స్ అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో ఆయన మాటాడుతూ.. రాష్ట్రంలోని పురపాలక సంఘాల్లో అధికారులపాలన పోవాలని, ప్రజాపాలన రావాలని లక్ష్యంతో ముందుకెళ్లాలని వెన్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు.

గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ ఇంచార్జి ఎండీగా సుబ్బారాయుడు

హైదరాబాద్, జూన్ 11 (నమస్తే తెలంగాణ): తెలంగాణ గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ (టీఎస్ఎల్‌డీఏ) ఇంచార్జి ఎండీగా తెలంగాణ వెటర్నరీ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ సుబ్బారాయుడుకి ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది.

మరోవైపు టీఎస్ఎల్‌డీఏ సీఈవో సబావత్ రాంచందర్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. గొర్రెల పంపిణీ స్కాం కేసులో మే 31న ఏసీబీ ఆయనను అరెస్ట్ చేసింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.